7 లక్షల కోట్ల అప్పంటే కోర్టుకీడుస్తం

మొదటిపేజీ తరువాయి...

విక్రమార్క తన మేధస్సుతో ఉమ్మడి ఏపీలో, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పులను కూడా బీఆర్ఎస్ ఖాతాలో జమచేశారు. 7 డిసెంబర్ 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. కానీ, మార్చి వరకు కాంగ్రెస్ చేసిన రూ.15,118 కోట్ల అప్పును కూడా కలిపి బీఆర్ఎస్ ఖాతాలో వేశారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి వారసత్వంగా వచ్చిన రూ.72,658 కోట్లను కూడా మా ఖాతాలోనే కలిపారు. 2014 కంటే ముందు గ్యారెంటీల పేరు మీద వారసత్వంగా వచ్చిన అప్పు రూ.11,609 కోట్లు బీఆర్ఎస్ ఖాతాలోనే వేశారు. ఈ విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేయని రూ.99,385 కోట్ల అప్పును బీఆర్ఎస్ ఖాతాలో వేసి అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారు. అదేవిధంగా కరోనా కాలంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయాల వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై రూ.40 వేల కోట్లు అదనంగా అప్పుల భారం పడింది' అని వివరించారు. భట్టి విక్రమార్క చెప్పినట్టుగా బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఆపాదించిన రూ.6.71 లక్షల కోట్ల అప్పులో బీఆర్ఎస్ చేయని అప్పు రూ.99,385 కోట్లు, ప్రభుత్వం చెల్లించాల్సిన అవసరం లేని రుణాలు రూ.1.54 లక్షల కోట్లు తీసేస్తే.. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పు రూ.4.17 లక్షల కోట్లు మాత్రమేనని స్పష్టంచేశారు.

> బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో చేసిన అప్పు రూ.4.17 లక్షల కోట్లు మాత్రమే. ఇందులో ఏమైనా తప్పు ఉంటే, ఈ సభలోనే మంత్రి భట్టి విక్రమార్క చెప్పాలి. ఈ రోజు తర్వాత ఎప్పుడైనా, ఎవరైనా మళ్లీ బీఆర్ఎస్ చేసిన అప్పు రూ.7 లక్షల కోట్లు అని అంటే వారిపై తమ పార్టీ కోర్టుకు వెళ్లడంతోపాటు లీగల్ నోటీస్ ఇచ్చి శాసనసభలో ప్రివిలేజ్‌మోషన్ ఇస్తాం.
>
> -అసెంబ్లీలో హరీశ్‌రావు

కాంగ్రెస్ అప్పు రూ. 1.27 లక్షల కోట్లు: భట్టి విక్రమార్క

ఏడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.27 లక్షల కోట్ల అప్పు చేసినట్టు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క నిజం ఒప్పుకొన్నారని హరీశ్‌రావు చెప్పారు. మొదటి ఏడాదే అంత అప్పు చేశారంటే.. ఐదేండ్లలో రూ.6.38 లక్షల కోట్ల అప్పు అవుతుందని పేర్కొన్నారు. ఎఫ్ఆర్‌బీఎం పరిమితి పెరిగితే ఐదేండ్లలో కాంగ్రెస్ అప్పు రూ.7 లక్షల కోట్లకు చేరుతుందని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో రూ.4.17 లక్షల కోట్లు అప్పు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేండ్లలోనే రూ.7 లక్షల కోట్లు అప్పు చేయనున్నట్టు తెలిపారు. ఈ లెక్కన ఎవరు ఎక్కువ అప్పు చేస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ దిగిపోయే నాటికి 1700 కోట్ల మిగులు బడ్జెట్

మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను బీఆర్ఎస్ పార్టీ అప్పుల రాష్ట్రంగా మార్చిందంటూ భట్టి ఆరోపణలపై హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014లో రెవెన్యూ మిగులు రూ.369 కోట్లు కాగా, 2023-24 బడ్జెట్‌లో రూ.1,704 కోట్ల మిగులు బడ్జెట్ అంటూ ఆర్థిక మంత్రిగా భట్టి విక్రమార్క చెప్పిన లెక్కలను గుర్తుచేశారు. నాడు రూ.369 కోట్ల మిగులు బడ్జెట్‌తో బీఆర్ఎస్‌కు ప్రభుత్వాన్ని అప్పగిస్తే, ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ రూ.1,700 కోట్ల మిగులు బడ్జెట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్పగించిందని తెలిపారు. తాము కూడా రెవెన్యూ సర్‌ప్లస్ గానే ఈ రాష్ట్రాన్ని అప్పజెప్పినట్టు స్పష్టంచేశారు. 2014లో రాష్ట్రం ఏర్పడినప్పుడు రాష్ట్ర బడ్జెట్ రూ.68 వేల కోట్లు ఉండగా.. దశ,దిశ లేని రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి రూ.2.93 లక్షల కోట్ల బడ్జెట్‌తో కాంగ్రెస్‌కు అప్పగించినట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన ఈ క్రింది గణాంకాలు వివరించారు.

- 2014లో రాష్ట్ర ప్రభుత్వ సొంత ఆదాయం రూ.35,770 కోట్లు.
- 2023లో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం రూ.1,53,837 కోట్లు.
- ఎక్స్‌పెండేచర్ 2014లో రూ. 62 వేల కోట్లు ఉంటే 2022-23 లో రూ.2.04 కోట్లకు పెంచినం.
- తలసరి ఆదాయం 2014లో రూ.1,24,000 ఉంటే, 2023లో రూ.3,56,564.
- 2014లో జీఎస్‌డీపీ రూ.4.51 లక్షల కోట్లు ఉంటే, 2023లో రూ.15.10 లక్షల కోట్లకు పెంచినం.

రైతులకు మేం చేసింది ఇదీ...

రైతులకు బీఆర్ఎస్ ఏం చేసిందంటూ భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలపై హరీశ్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో రైతాంగానికి మొత్తం రూ.4,08,902 కోట్లు వెచ్చించినట్టు తెలిపారు. దాని ఫలితంగానే రాష్ట్రంలో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందిందని స్పష్టంచేశారు. బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయరంగానికి చేసిన వ్యయాన్ని గణాంకాలతో వివరించారు.

- రైతుబంధుకు రూ.73,162 కోట్లు ఇచ్చినం.
- రైతుబీమా కింద రూ.5,465 కోట్లు ఇచ్చినం.
- రైతు రుణమాఫీ కోసం 28000 కోట్లు ఇచ్చినం.
- రైతులకు ఉచిత విద్యుత్తు సబ్సిడీ కోసం రూ.65 వేల కోట్లు ఇచ్చినం.
- నీటిపారుదల ప్రాజెక్టుల కోసం రూ. 2,37,000 కోట్లు ఖర్చు చేసినం.
- ఇలా రైతంగం కోసం రూ.4,08,902 ఖర్చు చేసింది కేసీఆర్ ప్రభుత్వం.

కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోతున్నది

బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులను తాము కడుతున్నామంటూ భట్టి విక్రమార్క చెప్పడంపై హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వారసత్వంగా ఇచ్చిన అప్పులను చెల్లించిందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్ల పాలనలో రూ.3 లక్షల కోట్ల అప్పులు, మిత్తీలను చెల్లించిందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాదిరిగా అప్పుల పేరు చెప్పి, ఇచ్చిన హామీలను తాము ఎగ్గొట్టలేదని ఎద్దేవా చేశారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని బాండ్ పేపర్ మీద సంతకం పెట్టి మరీ నమ్మించారని, కానీ 365 రోజులు గడిచినాహామీలు నెరవేర్చలేకపోవడంతో ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వ గ్రాఫ్ పడిపోతున్నదని చెప్పారు.

'దొంగ' వ్యాఖ్యలపై హరీశ్‌రావు ఫైర్

హరీశ్‌రావు మాట్లాడుతుండగా.. కాంగ్రెస్ సభ్యుల్లో ఒకరు హరీశ్‌రావును ఉద్దేశించి 'దొంగ' అంటూ వ్యాఖ్యలు చేశారు. దీనిపై హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. 'దొంగ అన్నది ఎవడా యూజ్‌లెస్ ఫెలో' అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. హరీశ్‌రావు వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేశారు. దీంతో సభలో కొద్దిసేపు గందరగోళం నెలకొన్నది. ఈ మాటలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై హరీశ్‌రావు స్పందిస్తూ.. తనను దొంగ అన్నవారినే యూజ్‌లెస్ ఫెలో అన్నట్టు వివరించారు.

హరీశ్‌రావుకు కేటీఆర్, ఎమ్మెల్యేల అభినందన

బీఆర్ఎస్ అప్పులపై కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని శాసనసభ వేదికగా సమర్థంగా తిప్పికొట్టిన హరీశ్‌రావుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, సంజయ్, మల్లారెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు అభినందనలు తెలియజేశారు. హరీశ్‌రావు ప్రసంగం ముగియగానే ఆయన దగ్గరికి వచ్చిన కేటీఆర్.. హరీశ్‌ను అలింగనం చేసుకొని భుజం తట్టారు.

రాష్ట్రం కోసం పనిచేసిన కేటీఆర్‌పై కేసులా?

ప్రభుత్వ పాలనపై ప్రశ్నిస్తే దబాయింపులు, కేసుల పేరతో వేధించడమే ప్రభుత్వం పనిగా పెట్టుకున్నదని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రం కోసం పనిచేసిన కేటీఆర్‌పై తప్పుడు కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఇమేజ్‌ను పెంచేందుకు కేటీఆర్ పారదర్శంగా ఫార్ములా కార్ రేసింగ్ నిర్ణయం తీసుకున్నారని స్పష్టంచేశారు. ఒకవేళ ప్రభుత్వం చెప్పేది నిజమైతే శాసనసభలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. సభలో తాము వాస్తవాలు చెప్పే ప్రయత్నం చేస్తుంటే, మంత్రులు డైవర్షన్ చేసే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి టీడీపీలో ఉన్నప్పుడు ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన జలయజ్ఞాన్ని ధనయజ్ఞం అన్న మాటలు మీకు గుర్తులేదా? అని ప్రశ్నించారు. తెలుగుదేశంలో ఉన్నప్పుడు ధనయజ్ఞం.. ఈరోజు జలయజ్ఞం అయిందా ? అని నిలదీశారు.

20 వేల కోట్ల అప్పు కోసం 400 ఎకరాల అమ్మకం

ప్రభుత్వ ఆస్తులు అమ్మడం లేదంటూ ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క అబద్ధాలు చెప్పున్నారని హరీశ్‌రావు దుయ్యబట్టారు. 26 జూన్ 2024 రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలో సర్వే నంబర్ 25లో ఉన్న 400 ఎకరాల భూమిని ఎకరా రూ.75 కోట్ల చొప్పున రూ.30 వేల కోట్లకు ఈ ప్రభుత్వం అమ్మిందని, ఇందుకు సంబంధించి జీవో 54ను విడుదల చేసిందని వివరించారు. ఇదే భూమిపై టీజీఐఐసీ రూ.20 వేల కోట్లు అప్పు తెచ్చేందుకు కాళ్లకు బలపం కట్టుకొని తిరుగుతున్నదని చెప్పారు. దీనిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ, ఆ భూములను విక్రయించలేదని, పరిశ్రమల కోసం టీజీఐఐసీకి ఇచ్చినట్టు వివరించారు. మంత్రుల స్పందనపై హరీశ్‌రావు మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం టీజీఐఐసీకి ఉచితంగా భూములు ఇచ్చిందని, కాంగ్రెస్ కూడా అదే విధంగా ఇవ్వొచ్చు కదా? అలా కాకుండా రూ.75 కోట్లకు ఎకరం అని ఎందుకు పెటారు? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూములను అమ్మబోదని, టీజీఐఐసీ దగ్గర కుదువ పెట్టదని, ఒక్క రూపాయి కూడా తీసుకోబోదని భట్టి విక్రమార్క చెప్పగలరా? అని నిలదీశారు.

స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామాకు సిద్ధమా?

- రైతుబీమా, మెస్‌చార్జీలు, ఫామ్ మెకనైజేషన్, డ్రిప్, స్ప్రింక్లర్లకు బీఆర్ఎస్ సర్కార్ ఒక్క రూపాయి ఇవ్వలేదని నిరూపిస్తే ఇక్కడే రాజీనామా చేస్తా
- భట్టికి హరీశ్‌రావు సవాల్

హైదరాబాద్, డిసెంబర్ 19(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబీమా చెల్లించలేదని, మెస్‌చార్జీలు పెంచలేదని, ఫామ్ మెకనైజేషన్, డ్రిప్, స్ప్రింక్లర్లకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని నిరూపిస్తే.. స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేయడానికి తాను సిద్ధమని, నిరూపించలేకపోతే ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క రాజీనామా చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్ చేశారు. గురువారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ.. 'ఈ అసెంబ్లీ సాక్షిగా భట్టి విక్రమార్కకు చాలెంజ్ విసురుతున్నా. మేం మెస్‌చార్జీలు పెంచింది నిజం. డ్రిప్పు, ఫామ్ మెకనైజేషన్‌కు డబ్బులు ఇచ్చింది నిజం.. మేం ఇవ్వలేదని రుజువు చేస్తే ఇక్కడే స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా ఇచ్చి వెళ్లిపోతాను. మీరు అబద్ధం చెప్పినట్టయితే, మీరు కూడా స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేయాలి' అంటూ హరీశ్‌రావు సవాల్ విసిరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబీమాకు 2018-19లో రూ.883 కోట్లు, 2019-20లో రూ.950 కోట్లు, 2020-21లో రూ.1,456 కోట్లు, 2021-22లో రూ.1,166 కోట్లు, 2022-23లో రూ.1,139 కోట్లు చెల్లించినట్టు వివరించారు. శాసనసభలో కాంగ్రెస్ వ్యవహరిస్తున్న తీరు 'అబద్ధాలు చెప్పు.. అవే అబద్ధాలను పదేపదే చెప్పు.. మళ్లీ మళ్లీ చెప్పు.. దబాయించి చెప్పు.. బెదిరించి చెప్పు.. కానీ.. అబద్ధాలు మాత్రమే చెప్పు.. ఎట్టి పరిస్థితుల్లోనూ నిజం మాత్రం చెప్పకు' అన్నట్టుగా ఉన్నదని ఎద్దేవా చేశారు.

ఓ మంత్రి మరో మంత్రిని ప్రశ్నించడమా!

క్యాబినెట్ అంటేనే సమష్టి నిర్ణయమని, ఇక ప్రశ్నోత్తరాల సమయంలో ఓ మంత్రి మరో మంత్రిని ప్రశ్నలు అడగడం ఏమిటని? ఇదెక్కడి సంస్కృతి అని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు శాసనసభలో మండిపడ్డారు. సమావేశాల తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో మంత్రి కోమటిరెడ్డి మూసీతోపాటు పలు అంశాలను ప్రస్తావించారు. సభ తీరుపై హరీశ్‌రావు విమర్శలు గుప్పించారు.

బడ్జెట్ అంశాలతోనే ఆర్బీఐ నివేదిక: భట్టి

హైదరాబాద్, డిసెంబర్ 19(నమస్తే తెలంగాణ): రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులపై ఇటీవల రిజర్వ్‌బ్యాంక్ విడుదల చేసిన నివేదికలో ఆయా రాష్ట్రాలు బడ్జెట్‌లో పొందుపర్చిన అంశాలనే యథావిధిగా ముద్రించినట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అందులో కొత్త అంశాలేవీ లేవని ఆయన చెప్పారు. గురువారం శాసనసభలో రుణాలపై భట్టి స్వల్పకాలిక చర్చను ప్రారంభించారు. రాష్ట్ర ఆదాయం, అప్పుల వివరాలను వెల్లడించారు. రూ.7,11,911 కోట్ల అప్పులు ఉన్నాయని, రుణాలకు వడ్డీలు చెల్లించుకుంటూనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. రూ.40,143 కోట్ల పెండింగ్ బిల్లులు ఉన్నాయని, దశలవారీగా వాటిని చెల్లిస్తున్నామని వివరించారు. ఇప్పటివరకు రూ.43,317 కోట్ల అప్పులు చెల్లించామని చెప్పారు.

కొడంగల్‌కు మెడికల్ కాలేజీ: రాజనర్సింహ

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తేతెలంగాణ) : సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌లో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొడంగల్ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభిస్తామని వెల్లడించారు. మెడికల్ కాలేజీకి అనుబంధంగా నర్సింగ్, పారామెడికల్ కాలేజీలు ప్రారంభిస్తామని తెలిపారు. ఆరోగ్య రంగానికి సంబంధించి శాసనమండలిలో సభ్యులు ఎంఎస్ ప్రభాకర్‌రావు, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, వాణీదేవి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ఈ ఏడాది 8 కొత్త మెడికల్ కాలేజీలు ప్రారంభించామని గుర్తుచేశారు. ఒక్కో కాలేజీలో 50 సీట్లు అందుబాటులో ఉంటాయని, 2,500కు పైగా డయాగ్నస్టిక్స్ యంత్రాలు ఉన్నాయని తెలిపారు.

పంట పెట్టుబడిపై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం

హైదరాబాద్, డిసెంబర్19 (నమస్తే తెలంగాణ): రైతులకు పంట పెట్టుబడి సాయంపై చర్చించాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీలో వాయిదా తీర్మానాన్ని అందజేసింది. యాసంగి సాగు మొదలైందని, రుణమాఫీ కాక, పంట పెట్టుబడి డబ్బులు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఎకరాకు రూ. 15వేలు అందించాలని డిమాండ్ చేశారు. రుణమాఫీతో పాటు, బోనస్ తదితర అంశాలపై చర్చించాలని వాయిదా తీర్మా నం అందజేశారు. రైతులకు సంబంధించిన అంశాలపై చర్చించాలని పచ్చకండువాలతో బీఆర్ఎస్ సభ్యులు అసెంబ్లీకి హాజరయ్యారు. ఇదిలా ఉంటే జీవో 317పై చర్చించాలని కోరుతూ బీజేపీ ఎమ్మెల్యేలు వాయిదా తీర్మానం అందజేశారు.

కోమటిరెడ్డిపై స్పీకర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు బీఆర్ఎస్ఎల్పీ ఫిర్యాదు చేసింది. బుధవారం శాసనసభలో మాజీ మంత్రి హరీశ్‌రావుపై నిరాధార ఆరోపణలు చేయడమే కాకుండా సభా సంప్రదాయాలకు విరుద్ధంగా అసభ్య పదజాలం వినియోగించారని, ఈ విషయంలో ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం స్పీకర్‌ను కోరింది. సభ జరుగుతున్నప్పుడు స్పీకర్ అనుమతి తీసుకోకుండా, నిరాధార ఆరోపణలు చేయడం ఉల్లంఘన అవుతుందని పేర్కొన్నది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, సుధీర్‌రెడ్డి, మాణిక్‌రావు, లక్ష్మారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, అనిల్ జాదవ్, విజయుడు, డాక్టర్ సంజయ్ ఉన్నారు.

ఓఆర్ఆర్ ఒప్పందం రద్దు చేయండి

ఓఆర్ఆర్ లీజుకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి విచారణకు ఆదేశించడాన్ని హరీష్‌రావు స్వాగతించారు. తాము విచారణకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. అయితే, తాను విచారణ కోరినట్టుగా సీఎం రేవంత్ చెప్పడం తప్పు అని పేర్కొన్నారు. భట్టి విక్రమార్క పదేపదే లేచి ఓఆర్ఆర్ అమ్ముకున్నారంటూ ఆరోపిస్తుంటే, అవసరమైతే ఆ ఒప్పందాన్ని రద్దు చేయండని కోరినట్టు తెలిపారు. దీనిని తప్పుదోవ పట్టించి తాను విచారణ కోరినట్టుగా ప్రచారం చేయడం, స్వయంగా సీఎం ఆఫీసు నుంచి తన కోరిక మేకు విచారణకు ఆదేశించినట్టుగా ప్రెస్‌నోట్ ఇవ్వడం దారుణమని పేర్కొన్నారు. ఓఆర్ఆర్ ఒప్పందాన్ని రద్దుచేశాకే దానిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

సభనే నడపలేక పోతున్నరు.. ప్రభుత్వాన్నేం నడుపుతరు?

- ఎజెండాలో ఒకటుంటే మరొకటి చర్చిస్తారు
- ఫ్లోర్ లీడర్లకు కూడా సమాచారం ఇవ్వరు?
- సభ ఎన్ని రోజులో బీఏసీలోనూ చెప్పరు!
- రుణాలపై 8సార్లు చర్చించారు.. ఇంకెన్నిసార్లు?
- ప్రభుత్వ వైఖరిపై అక్బరుద్దీన్ ఒవైసీ ధ్వజం

హైదరాబాద్, డిసెంబర్ 19(నమస్తే తెలంగాణ): 'ఎజెండాలో ఉండేది ఒకటి.. చర్చించేది మరొకటి. ఎజెండాలోని అంశాల ఆధారంగా చర్చకు మేము సిద్ధమైతే.. తీరా ఇక్కడికొచ్చాక కొత్త అంశం తెరపైకి వస్తుంది. సిద్ధంకాకుండా ఎలా మాట్లాడాలి. సభ ఎన్నిరోజులు నడుపుతారో బీఏసీలోనూ చెప్పరు. సభలో ఏమి జరుగుతున్నదో అర్థం కావడం లేదు. సభని నడపలేనివారు ప్రభుత్వాన్ని ఎలా నడుపుతారు?' అని ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ రాష్ట్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. శాసనసభ నిర్వహణపై గురువారం ఒవైసీ అధికారపక్షంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. మధ్యాహ్నం భోజన విరామం అనంతరం శాసనసభ సమావేశంకాగానే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాష్ట్ర రుణాలపై స్వల్పకాలిక చర్చను ప్రారంభించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పులు, సంక్షేమ పథకాలు తదితర అంశాలపై ఆయన మాట్లాడుతుండగా అక్బరుద్దీన్ జోక్యం చేసుకున్నారు. ఎజెండాలో పేర్కొన్న ప్రకారం బిల్లులపై చర్చించాల్సి ఉన్నదని, అవి పూర్తయ్యాక రుణాలపై స్వల్పకాలిక చర్చ చేపట్టాలని సూచించారు. తాము బిల్లులపై మాట్లాడేందుకు సిద్ధమై వస్తే ఇప్పుడు రుణాలపై చర్చ చేపట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఈ అంశం చేపడుతున్నట్టు తమకు ముందుగా సమాచారం ఎందుకివ్వలేదని నిలదీశారు. సభలో ఏ అంశాన్నైనా చేపట్టేందుకు అనుమతించే అధికారం స్పీకర్‌కు ఉన్నప్పటికీ ఫ్లోర్ లీడర్లకు ముందస్తు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత శాసనసభా వ్యవహారాల మంత్రితోపాటు విప్, సభా కార్యదర్శిపై ఉన్నదని చెప్పారు.

'అసలు సభ ఎన్నిరోజులు జరుపుతారు'

అసలు సభను ఎన్నిరోజులు నడుపుతారో కూడా ఇంతవరకు సమాచారం ఇవ్వలేదని అక్బరుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. ఒకవేళ ఎజెండాలో ఏమైనా మార్పులు జరిగితే ఆ సమాచారం ఫ్లోర్ లీడర్లకు ఇవ్వాల్సి ఉంటుందని, తాము అడుగుతున్నా కార్యదర్శి నుంచి కూడా సరైన సమాధానం రావడంలేదని వాపోయారు. రుణాలపై ఇప్పటికే 8 సార్లు సభలో చర్చించారు. ఇంకా ఎన్నిసార్లు దీనిపై చర్చిస్తారని ప్రశ్నించారు. ఒకవేళ ఎజెండాలో లేని అంశాన్ని చేపట్టాల్సి వస్తే సభలో స్పీకర్‌ను అనుమతి కోరడం, స్పీకర్ దానికి అనుమతించడం సంప్రదాయమని, అటువంటిది ఏమీ లేకుండా ఇష్టమొచ్చిన అంశంపై చర్చ చేపట్టడం, ఎవరైనా ప్రశ్నిస్తే, స్పీకర్ అనుమతితోనే చేపట్టినట్టు చెప్పడమేమిటని నిలదీశారు. ఏదైనా అంశాన్ని చేపట్టాల్సి వచ్చినప్పుడు అందరి అభిప్రాయాలనూ పరిగణనలోకి తీసుకోవాలని అక్బరుద్దీన్ ఒవైసీ ప్రభుత్వానికి సూచించారు.

ఇదేనా సభ నడిపే పద్ధతి: హరీశ్‌రావు

'ఎజెండా ప్రకారం బిల్లులపై చర్చించాలి. తీరా ఇక్కడికి వచ్చాక రుణాలపై చర్చ ప్రారంభించారు. ఇదేనా సభ నడిపే పద్ధతి' అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రభుత్వ వైఖరిపై ధ్వజమెత్తారు. సభలో ఏ అంశాన్ని చేపడుతున్నారని తాము కార్యదర్శిని అడిగితే ఆయన కూడా తమకు సమాధానం చెప్పడం లేదని తెలిపారు. ముందస్తు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత శాసనసభా కార్యదర్శిపై ఉన్నదని, గతంలో తాము ఫ్లోర్ లీడర్లకు ముందస్తు సమాచారం ఇచ్చేవాళ్లమని గుర్తుచేశారు. ఎజెండాను పాటించకపోవడం సభాసంప్రదాయాలను ఉల్లంఘించడమేనని మండిపడ్డారు. బీజేపీ పక్ష నాయకుడు మహేశ్వర్‌రెడ్డి సైతం సభ నిర్వహణపై అసహనం వ్యక్తంచేశారు. ఎజెండా ప్రకారం సభను నడపాలని కోరారు.

అప్పుడప్పుడు అలా జరుగుతుంది: మంత్రి శ్రీధర్‌బాబు

రుణాలపై చర్చ ముఖ్యమైందని భావించినందునే దానిపై చర్చ చేపట్టామని, అప్పుడప్పుడూ అలా జరుగుతుంటుందని శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు వివరణ ఇచ్చారు. హరీశ్‌రావు ప్రివిలేజ్ నోటీసు ఇచ్చినందునే ఈ అంశాన్ని చేపట్టాలని నిర్ణయించి, స్పీకర్ అనుమతితోనే చేపట్టినట్టు పేర్కొన్నారు.

భూ వ్యవహారంపై తడబడ్డ అరికెపూడి

- కుటుంబసభ్యుల మీద 4 ఎకరాలు ఉందంటూనే 2014 ఎన్నికల అఫిడవిట్‌లో 6 ఎకరాలు చూపారు
- క్లియర్ టైటిల్ భూములు కొనుగోలు చేశామంటూనే.. తన సర్వే నంబర్ మిస్సైందని కలెక్టర్‌ను ఆశ్రయించారు
- సంచలనం సృష్టించిన ఎమ్మెల్యే గాంధీ భూ వ్యవహారం
- గాజుల రామారం సీలింగ్ భూముల మీద కలెక్టర్ రివ్యూ
- ఖరీజ్ ఖాతా భూములు ఎట్లా రిజిస్ట్రేషన్ అయ్యాయో కలెక్టర్‌కే అంతు చిక్కని వైనం

హైదరాబాద్, డిసెంబర్19(నమస్తే తెలంగాణ): తన కష్టార్జితంతో 2000 సంవత్సరానికి ముందుగానే కుత్బుల్లాపూర్ మండలంలో భూములు కొనుగోలు చేశామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తెలిపారు. ఈ మేరకు 'సీలింగ్ భూమి.. సమర్పయామి' శీర్షికతో గురువారం 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. తన కుటుంబసభ్యుల పేరు మీద 4 ఎకరాలు, ఇతరుల పేర్ల మీద 7 ఎకరాల చొప్పున మొత్తం 11 ఎకరాలు క్లియర్‌టైటిల్ ఉన్న భూమిని కొనుగోలు చేసినట్టు పేర్కొన్నారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేకనే ఇటువంటి అసత్య వార్తలు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. అయితే, 2014వ సంవత్సరంలో తెలంగాణ శాసనసభకు జరిగిన ఎన్నికల్లో అరికెపూడి గాంధీ శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ పత్రాల్లో స్పౌజ్‌తోపాటు ముగ్గురు డిపెండెంట్లు ఉన్నట్టు వెల్లడించారు. ప్రతి డిపెండెంట్ పేరు మీద గాజులరామారంలోని సర్వే నంబర్ 307లో 2 ఎకరాల చొప్పున 19/7/2006లో భూమి కొనుగోలు చేసినట్టు పొందుపరిచారు. ఈ లెక్కన ఆయన కుటుంబసభ్యుల పేర్ల మీద 6 ఎకరాల భూమి నమోదై ఉండాలి. తన భార్య పేరు మీద ఈ సర్వే నంబర్‌లో ఎలాంటి భూమి ఉన్నట్టు చూపించలేదు. అయితే, గురువారం ఆయన ఇచ్చిన వివరణలో కుటుంబసభ్యుల పేరు మీద నాలుగు ఎకరాలు కొనుగోలు చేసినట్టు పేర్కొన్న గాంధీ.. ఎన్నికల అఫిడవిట్‌లో 6 ఎకరాలు తన కుటుంబసభ్యుల మీద ఎలా చూపించారనేది అంతు చిక్కని ప్రశ్న. 2023లో జరిగిన శాసనసభ ఎన్నికలకు సమర్పించిన నామినేషన్ పత్రంలో మాత్రం తన భార్య శ్యామలాదేవి పేరిట 2 ఎకరాలు ఉన్నట్టు, ఈ భూమిని సరిగ్గా అదే తేదీ 19/7/2006న ప్రణీతతో కలిసి కొనుగోలు చేసినట్టు చూపించారు.

ఇవీ సందేహాలు

- 2000 సంవత్సరం కంటే ముందే భూములు కొనుగోలు చేసి ఉంటే, 2006 వరకు ఆయా భూములను ఎందుకు రిజిస్ట్రేషన్ చేసుకోలేదు? రెవిన్యూ అధికారుల గురువారం ఇచ్చిన వివరణలో.. హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి 2006 సేల్‌డీడ్‌లను 2010లో మ్యుటేషన్ చేసినట్టు తెలిపారు. నిజంగా ఎమ్మెల్యే గాంధీ క్లియర్ టైటిల్‌నే కొనుగోలు చేసినప్పుడు కోర్టుకు వెళ్లాల్సిన అవసరం ఏమిటి?
- 2010లోనే మ్యుటేషన్ అయిన తన భూమి కనబడటం లేదని, కనపడని సర్వే నంబర్లను ఇంక్లూడ్ చేయాలని 2022లో అంటే దాదాపు 12 ఏండ్ల తరువాత ఎందుకు దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చింది?
- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌కు చేసుకున్న దరఖాస్తులో క్రమసంఖ్య1లో సేల్‌డీడ్ నంబర్ 16818/2006, కొనుగోలు తేదీ19/7/2006 ప్రకారం తన భార్య పేరు మీద 2 ఎకరాల స్థలం ఉన్నట్టు పేర్కొన్నారు. తిరిగి క్రమ సంఖ్య 9లో సరిగ్గా ఇదే డాక్యుమెంట్ నంబర్ మీద ప్రవీణ్‌కుమార్ పేరుపై 2 ఎకరాలు ఉన్నట్టు సూచించారు. కనీసం ఈ తప్పును కూడా పరిశీలించకుండా జిల్లా కలెక్టర్ ప్రొసీడింగ్స్ ఇవ్వటం గమనార్హం. నిజానికి అంతా క్లియర్‌గా ఉన్నప్పుడు ఏడాదికోసారి పేర్లు ఎందుకు మారుతున్నట్టు?

238 ఎకరాలు ఉంటే చాలట: రెవెన్యూ అధికారుల వింత ప్రవర్తన

కాగా గాజుల రామారం గ్రామం సర్వే నంబర్ 307లోని 12 ఎకరాల సీలింగ్‌భూమి పట్టాభూమిగా మారిందని, ఎమ్మెల్యే గాంధీ కుటుంబసభ్యుల పేరిట మారిందంటూ 'సీలింగ్ భూమి.. సమర్పయామి' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైన నేపథ్యంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ రివ్యూ సమావేశం నిర్వహించినట్టు తెలిసింది. సేల్‌డీడ్ 2006ను హైకోర్టు తీర్పు ప్రకారం 2010లో మ్యుటేషన్ చేసినట్టు, మిస్సింగ్ సర్వే నంబర్ పేరిట 2022లో పాస్ పుస్తకాలు జారీ చేసినట్టు, ఈ ఏడాది డిసెంబర్‌లో నాలా కన్వర్షన్ చేసినట్టు సంబంధిత అధికారులు కలెక్టర్‌కు నివేదించారని తెలిసింది. సర్వే నంబర్ 307లో 238 ఎకరాలు గతంలో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు లీజుకు ఇచ్చారని, ఎస్ఎఫ్‌సీకి కేటాయించిన 238 ఎకరాలు క్లియర్‌గా ఉంటే మిగిలిన వివాదాలతో తమకు సంబంధం లేదని కలెక్టర్‌కు వివరణ ఇచ్చినట్టు సమాచారం. సమావేశంలో రెవెన్యూ అధికారులు జిల్లా కలెక్టర్‌ను తప్పుదారి పట్టించినట్టు తెలుస్తున్నది. రాష్ట్రంలో ల్యాండ్ సీలింగ్ యాక్ట్ అమల్లోకి వచ్చాక గాజుల రామారంలోని సర్వే నంబర్ 307 మీద 1977 జనవరి 11న ఒకసారి, 1977 ఫిబ్రవరి 12న రెండోసారి, 1977 ఫిబ్రవరి 23న మూడోసారి అప్పటి జిల్లా కలెక్టర్ మొత్తం మూడుసార్లు నోటిఫికేషన్ ఇచ్చి 317.6 ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసున్నది. అప్పటినుంచి రెవెన్యూ రికార్డుల్లో ఈ భూమిని ఖరీజ్ ఖాతాగా చూపిస్తున్నారు. ఇందులోంచి 2007లో 238 ఎకరాలు ఎస్ఎఫ్‌సీకి 99 ఏండ్లకు లీజుకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అది పోగా 79 ఎకరాలకు ఎవరు బాధ్యులు? ప్రభుత్వం కాదా? కేవలం 238 ఎకరాలు ఉంటే చాలు అనుకుంటే మిగిలిన ప్రభుత్వ భూమిని ఎవరికి ధారాదత్తం చేయాలనుకుంటున్నారు? స్టోన్‌క్రషర్లకు భూములు లీజుకు ఇచ్చినట్టు రెవెన్యూ రికార్డుల్లో ఉన్నది. ఎమ్మెల్యే కుటుంబసభ్యులు చేస్తున్న దరఖాస్తులో సూపర్‌మెటల్ ఇండస్ట్రీ లీజ్ తీసుకొని నడిపినట్టు పేర్కొన్నారు. లీజ్ భూములను రిజిస్ట్రేషన్ చేసుకున్నప్పుడు, విచారణ చేయకుండా కోర్టు ఆదేశమంటూ గుట్టుచప్పుడు కాకుండా మ్యుటేషన్ చేయడం వెనుక ఎవరి ఒత్తిడి ఉన్నది? గాజులరామారం రెవెన్యూ రికార్డు- 1999 ప్రకారం సర్వే నంబర్ 307 'ఖరీజ్ ఖాతా' అంటే సీలింగ్ మిగులు అని ఉన్నది. ఈ భూమి ఎటు పోయిందో తేల్చకుండా కేవలం 238 ఎకరాలు ఉంటే చాలనుకోవడం వెనుక మర్మమేమిటేనని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఓఆర్ఆర్ లీజుపై సిట్‌తో విచారణ

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): ఔటర్ రింగ్‌రోడ్డు లీజు ఒప్పందంపై విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇందుకోసం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం(సిట్)ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు గురువారం శాసనసభలో ప్రకటన చేశారు. విచారణకు అనుమతి ఇవ్వాల్సిందిగా స్పీకర్‌ను కోరారు. మంత్రివర్గంలో చర్చించి విధివిధానాలు నిర్ణయిస్తామని తెలిపారు. ఓఆర్ఆర్ లీజు ఒప్పందంలో బీఆర్ఎస్ నేతలకు అయాచిత లబ్ధి జరిగిందని, ఓడిపోతామని తెలిసే ఎన్నికల ముందు లీజు ఇచ్చారని ఆరోపించారు.

అటవీశాఖ తీరుపై ఎమ్మెల్యేల మండిపాటు

- పోడురైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆగ్రహం
- త్వరలోనే పరిష్కారం చూపుతాం: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, డిసెంబర్19 (నమస్తే తెలంగాణ): అటవీశాఖ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, పట్టాలున్నా గిరిజన రైతులను, పోడు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అసెంబ్లీలో పలువురు ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు మదన్‌మోహన్, మురళీనాయక్, బాలునాయక్, పాల్వాయి హరీశ్, అనిరుధ్‌రెడ్డితోపాటు పలువురు సభ్యులు అటవీశాఖ అధికారులు, గిరిజన రైతుల మధ్య భూవివాదాల సమస్యలపై ప్రస్తావించారు. గిరిజన రైతులకు అనేక ఆటంకాలు సృష్టిస్తున్నారని, అభివృద్ధి పనులకు సైతం అడ్డుపడుతున్నారని ఎమ్మెల్యేలు తెలిపారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బదులిస్తూ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 35 నియోజకవర్గాల్లో అటవీశాఖ అధికారులు, గిరిజన రైతుల మధ్య వివాదాలు, రెవెన్యూ హద్దులపై సమస్యలు నెలకొని ఉన్నాయని, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

సంక్రాంతి తర్వాత కొత్త రేషన్ కార్డులు: ఉత్తమ్

హైదరాబాద్, డిసెంబర్19 (నమస్తే తెలంగాణ): సంక్రాంతి తర్వాత రాష్ట్రంలో అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులను అందజేస్తామని పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. రేషన్ డీలర్ల సమస్యలు, కొత్త కార్డులపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితర సభ్యులు అసెంబ్లీలో ప్రస్తావించారు. కొత్త కార్డులు అర్హులందరికీ ఇస్తారా? సన్నబియ్యం ఎప్పటి నుంచి ఇస్తారు? డీలర్ల కమీషన్ పెంపు అంశాలను లేవనెత్తారు.

కొండా సురేఖ విచారణకు రావాలి

- నాగార్జున పరువు నష్టం కేసులో కోర్టు ఆదేశం

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): సినీనటుడు నాగార్జున దాఖలు చేసిన పరువు నష్టం కేసులో మంత్రి కొండా సురేఖ వ్యక్తిగతంగా హాజరు కావాలని నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు స్పష్టంచేసింది. కేసులో త్వరితగతిన విచారణ చేపట్టేందుకు తాము అంగీకరించినందున ఈ నెల 26న కొండా సురేఖ హాజరుకావాలని ఆదేశించింది. ఈ మేరకు నాగార్జున దాఖలు చేసిన పరువునష్టం కేసులో సమన్లు జారీ చేసిన కోర్టు గురువారం చేపట్టిన విచారణకు మంత్రి సురేఖ హాజరుకాలేదు. ప్రభుత్వ కార్యకలాపాల వల్ల సురేఖ హాజరుకాలేదని ఆమె తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అనంతరం విచారణను ఈ నెల 26కు కోర్టు వాయిదా వేసింది.